ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

సోమవారం 21 ఏప్రిల్ 2025

'బొమ్మినేని' ఆస్పత్రి అనుమతి రద్దు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలందిస్తున్న బొమ్మినేని ఆస్పత్రి అనుమతి రద్దు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్నప్రసన్నకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దుర్గారాణి ఆస్పత్రి పేరిట ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయ నిధి సొమ్ము అక్రమంగా కాజేసినట్లు విచారణలో తేలింది. దీంతో దుర్గారాణి ఆస్పత్రిని సుమారు యేడాది క్రితం సీజ్ చేశారు. అయితే ఆసుపత్రిని తిరిగి నిర్వహించాలని బొమ్మినేని ఆసుపత్రి పేరుతో నడిపిస్తున్నారు. ఆసుపత్రి ఇంచార్జి వైద్యురాలిగా (గైనకాలజిస్ట్) డా.షాహిన పేరుతో బొమ్మినేని ఆసుపత్రి నిర్వహణకు అనుమతులు పొందారు. బోర్డుపై పలువురి వైద్యులు ఉన్నప్పటికీ వైద్య సేవలు అందించే వారు లేరని జిల్లా వైద్యాధికారి తనిఖీలో వెల్లడైంది. సంతాన సాఫల్యత కేంద్రం అనుమతి లేకున్నా ఆసుపత్రి బోర్డుపై బొమ్మినేని హస్పిటల్, గైనకాలజీ, జనరల్, సంతాన సాఫల్యత అని ఉండి ప్రజలను మోసం చేస్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో అనుమతులు రద్దు చేసినట్లు తెలిపారు.

ఈనెల 27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ధర్మారం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ, తరగతితో పాటు 7, 8, 9, 10వ, తరగతులలో మిగిలి ఉన్న సీట్లకు ఈ నెల 27న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ తెలిపారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో అప్లై చేసిన విద్యార్థులందరూ నేటి నుంచి తెలంగాణ మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 27న, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7 నుంచి 10వ, తరగతి వరకు ప్రవేశ పరీక్ష జరగనున్నట్లు ఆయన వెల్లడించారు. పరీక్ష సమయం కంటే అరగంట ముందే సెంటర్‌కు చేరుకోవాలన్నారు.



భూ భారతితో

సాదాబైనామాలకు మోక్షం

కొత్త చట్టంతో భూ సమస్యల పరిష్కారం

కొత్త చట్టంలో సెక్షన్ 6, రూల్ 6 ప్రకారం సాదాబైనామాలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా 2014 జూన్ 2 కంటే ముందు సాదాబైనామాల ద్వారా భూమి కొనుగోలు చేసి 12 ఏళ్ళు స్వాధీనంలో ఉండడంతో పాటు, గత ప్రభుత్వం నిర్దేశించిన గడువు లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులపై ఆర్డీవోలు విచారణ జరుపుతారు. పీవోటీ, సీలింగ్, ఆయా చట్టాల ఉల్లంఘన లేదని నిర్ధారించుకున్న తర్వాత అర్హత ఉన్న రైతుల నుంచి ప్రస్తుత రిజిస్ట్రేషన్ల చార్జీలు, స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఆ తర్వాత హక్కుల రికార్డుల్లో నమోదు చేసి పాసు పుస్తకం జారీ చేస్తారు.

- జిల్లాలో పెండింగులో 35,580 దరఖాస్తులు
- భూ హక్కుల కోసం ఐదేళ్లుగా నిరీక్షణ
- ప్రభుత్వ పథకాలు కోల్పోయిన రైతులు
- జూన్ 2 నుంచి పూర్తి స్థాయిలో భూ భారతి అమలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంతో సాదా బైనామాలతోపాటు ఇతర సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి. గత ప్రభుత్వం రెవెన్యూ చట్టంలో మార్పులు చేసి భూ ప్రక్షాళన చేపట్టి ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. సాదా బైనామాల్లో ఉన్న భూములకు పట్టాలిచ్చేందుకు గత ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఆ మేరకు పెద్దపల్లి జిల్లాలో 35,580 దరఖాస్తులు వచ్చాయి. ధరణి పోర్టల్‌లో సాదాబైనామాల పరిష్కారానికి ఆప్షన్ లేకపోవడంతో దాదాపు ఐదేళ్లుగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఈ పోర్టల్‌తో అనేక మంది రైతులు రికార్డుల్లో పేర్లు, భూ విస్తీర్ణం, సర్వే నంబర్లు తప్పుగా నమోదయ్యాయి. వాటి సవరణలకు కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదు. తాము అధికారంలోకి వస్తే ధరణి తొలగిస్తామని ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.

ఆ మేరకు ప్రభుత్వం కమిటీ వేసి ధరణి పోర్టల్ ద్వారా రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధ్యయనం చేసి కొత్తగా భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చింది. రాష్ట్రంలోని పలు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. మిగతా మండలాల్లో భూ భారతి చట్టం పై అవగాహన కల్పిస్తున్నారు. పూర్తి స్థాయిలో ఈ చట్టం జూన్ 2వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఇప్పటి వరకు ధరణి పోర్టల్‌తో ఇబ్బందులు పడ్డ రైతులు తమ కష్టాలు తీరాయని భావిస్తున్నారు.

జిల్లాలో పెండింగ్ దరఖాస్తులు ఇలా..

2014 జూన్ 2వ తేదీలోపు సాదా బైనామాల ద్వారా భూములను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేసుకోలేని వారి భూములను ఆర్వోఆర్ చేసి పట్టాదార్ పాసు పుస్తకాలను జారీ చేసేందుకు ప్రభుత్వం 2020 ఆక్టోబర్ 1 నుంచి 31 వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత నవంబరు 10వ తేదీ వరకు పొడిగించింది. మాన్యువల్‌గా కాకుండా మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 35,580 దరఖాస్తులు వచ్చాయి. అంతర్గాం మండలంలో 908, పాలకుర్తిలో 1,642, ధర్మారంలో 2284, ఎలిగేడులో 1215, కమాన్‌పూర్‌లో 532, రామగుండంలో 412, రామగిరిలో 1213 దరఖాస్తులు వచ్చాయి. అలాగే జూలపల్లి మండలంలో 1230, ముత్తారం 2834, కాల్వశ్రీరాంపూర్‌లో 5670, ఓదెల లో 1557, పెద్దపల్లిలో 5939, మంథనిలో 4563, సుల్తానాబాద్ మండలంలో 3556 దరఖాస్తులు వచ్చాయి.

2020 అక్టోబరు 24వ తేదీన ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకురాగా, నవంబరు 2వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. కానీ సాదాబైనామాలు పరిష్కారం కాలేదు. సాధారణంగా భూమి కొనుగోలు పద్ధతి రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా జరుగుతుంది. కొనుగోలు చేసిన వ్యక్తి సదరు డాక్యుమెంట్‌తో రెవెన్యూ కార్యాలయం ద్వారా పట్టాదార్ పాస్ పుస్తకాలను పొందేవారు. అయితే గతంలో రైతులకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్లపై అవగాహన లేని సమయంలో సాదాబైనామాలు, తెల్లకాగితాలపై ఒప్పందం చేసుకుని భూమిని తమ స్వాధీనంలోకి

మిగతా 8వ పేజీలో

భానుడి భగభగ...

రామగుండంలో 41.4 డిగ్రీలు నమోదు



తలపై రుమాలు కప్పుకుని వెళుతున్న మహిళలు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మూడు రోజులుగా భానుడు భగభగమంటున్నాడు. ఆదివారం గరిష్ట ఉష్ణోగ్రత 41.4డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 26.2డిగ్రీలు నమోదైంది. రెండు రోజులుగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం 11గంటలకే లక్ష్మీనగర్, చౌరస్తా, కళ్యాణ్‌నగర్ వాణిజ్య, వ్యాపార కూడళ్లు జనం లేక రోడ్లు వెలవెలబోయాయి. ఉదయం 7గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపడంతో మధ్యాహ్నం పారిశ్రామిక ప్రాంతంలోని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. శనివారం గరిష్ట ఉష్ణోగ్రత 40.2, కనిష్ట 28.2, శుక్రవారం 38.8, 27.7, గురువారం 38.6, 26.4, బుధవారం 38.4, 228, మంగళవారం 39.2, 25.0, సోమవారం 39.0, 23.0 డిగ్రీలు నమోదు కాగా 3డిగ్రీల ఉష్ణోగ్రతలు ఒకేసారి పెరగడంతో ఉక్కపోత మొదలైంది.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట



ధూళికట్టలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం ధూళికట్ట, ముప్పిరితోట, రాములపల్లి, ర్యాకల్‌దేవ్‌పల్లి, ఎలిగేడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు వ్యవసాయ రంగానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయన్నారు. ఎలాంటి కటింగ్‌లు లేకుండా ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సన్నవడ్లకు బోనస్ ప్రకటించడంతో సీడ్ కంపెనీలు వరి విత్తనాలను ఉచితంగా ఇవ్వడంతోపాటు పంట చేతికి అందేవరకు సీడ్ కంపెనీలు ఖర్చులు భరిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ పాలనలో కటింగ్‌ల పేరిట రైతులను నిలువునా ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్లోకి ధాన్యం తీసుకువచ్చి తక్‌పట్టీలను పొంది రైతులు నిర్భయంగా ఉండవచ్చని, 48గంటల్లోనే వారిఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. పీఏసీఎస్ చైర్మన్‌లు పుల్లూరి వేణుగోపాల్‌రావు, గోపు విజయభాస్కర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, బుద్దినేని వామన్‌రావు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, పర్శరాంగౌడ్, తాటిపల్లి రమేష్‌బాబు, పోల్సాని పుల్లారావు, శంకర్, స్వామి, సీతఃవేలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖనిలో ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో తరలివస్తున్న మహిళలు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా ఆదివారం గౌడ కులస్థుల ఆధ్వర్యంలో గోదావరిఖని చౌరస్తాలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు హన్మంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు ఇంటి నుంచి బోనాలు తీసుకువచ్చి పోచమ్మకు సమర్పించారు. పోతరాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్లతో గోదావరిఖని నలుమూలల నుంచి గౌడ కులస్థుల మహిళలు నెత్తిన బోనం పెట్టుకుని పోచమ్మ ఆలయానికి తరలివచ్చారు. దీంతో పోచమ్మ ఆలయం కిటకటలాడింది. ప్రధాన చౌరస్తా నుంచి లక్ష్మీనగర్‌కు వెళ్లే రోడ్లను ట్రాఫిక్ పోలీసులు మూసివేశారు. వన్‌టౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నాయకులు బాలసాని స్వామిగౌడ్, వంగ శ్రీనివాస్, కోడూరి రవి, జనార్ధన్(లడ్డు), గున్నాల శ్రీధర్, పొన్నం అంజయ్య, బూసారపు సంతోష్, సురేందర్ పాల్గొన్నారు.

గంగారంలో పోచమ్మ బోనాలు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారంలో గీత కార్మికులు ఎల్లమ్మ బోనాల సందర్భంగా ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఇంటింటికి కదలివచ్చి డప్పుచప్పుల్లతో శివసత్తులతో పూనకాలతో పోచమ్మ తల్లికి బోనం సమర్పించారు. గౌడ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

రామగుండాన్ని సుందరంగా తీర్చిదిద్దమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రామగుండాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఆదివారం సింగరేణి ఆధ్వర్యంలో గోదావరిఖని తిలక్‌నగర్‌లో రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన ప్రజాపార్కును ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి నిధులు రూ.5కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం, రిటైర్డ్ కార్మికులు, మహిళల కోసం రూ.20లక్షలతో త్వరలోనే జిమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు, తిలక్‌నగర్‌లో మూడు నెలల్లో పార్కు నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలవుతాయని చెప్పారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ రామగుండం ఏరియాలో కార్మికుల సంక్షేమానికి సింగరేణి సంస్థ కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తుందని, కార్మికవాడలను అభివృద్ధి చేయడానికి సీఎస్ఆర్ నిధులను వినియోగిస్తున్నట్లు చెప్పారు. బొంతల రాజేష్, కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాష్, కొలసాని శ్రీనివాస్, సింగరేణి అధికారులు గోపాల్‌సింగ్, కిరణ్‌బాబు, కరుణ, హనుమంతరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె



సమ్మె చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

రామగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కాంట్రాక్టు అధ్యాపకుల బృందం డిమాండ్‌ల పరిష్కరించాలని ఆదివారం రెండో రోజు సమ్మె చేపట్టారు. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాల యాల్లో అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ప్రధాన డిమాండ్ పై కళాశాల ఎదుట అధ్యాపకుల బృందం సమ్మె చేస్తోంది. విద్యార్హతలు కల్గి ఉండి దశాబ్దాల కాలంగా కళాశాలల్లో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు. రెగ్యులరైజ్‌తో పాటు ఉద్యోగ భద్రతతో కూడిన బెసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏతో పాటు 3శాతం సంవత్సర ఇంక్రిమెంట్‌ను అమలు చేయాలని కోరారు.

వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టిన మజ్లిస్

- విలేకరుల సమావేశంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

6



'కూనంనేని'కి ఘన స్వాగతం



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఏరియా-2కు వచ్చిన సీపీఐ ఎమ్మెల్యే ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావుకు ఆదివారం ఏఐటీయూసీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. షిర్కే చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి కూనంనేని పూలమాలలేవేశారు. అనంతరం యూనియన్ ఆఫీస్‌ని సందర్శించారు. ఈసందర్భంగా బ్రాంచి కమిటీ, స్థానిక నాయకులను ఆయన పరిచయం చేసుకుని ఆర్జీ-2లో యూనియన్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎల్ ప్రకాష్, రాజారత్నం, జీ రవీందర్, బుర్ర తిరుపతితో పాటు బ్రాంచి, పిట్ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో బాలింతల ఇబ్బందులు

- కుట్లు మానక అవస్థలు
- స్టెరిలైజేషన్ లేకుండా ఆపరేషన్లు
- రోగుల బంధువులతో సోకుతున్న ఇన్‌ఫెక్షన్లు



కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇన్‌ఫెక్షన్ సోకి బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. సిజేరియన్ చేయించుకున్న మహిళలు కుట్లు మానక పోవడంతో నెలల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెలకు 150 నుంచి 200 ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో ఎక్కువశాతం సిజేరియనే కావడంతో చాలా మంది కుట్లు మానక వాటి నుంచి చీము కారడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

దీంతో కుట్లు వేయాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. వాస్తవానికి సిజేరియన్ చేసిన బాలింతలను ఏడు రోజులకు డిశ్చార్జి చేయాల్సి ఉండగా కుట్లు మానక పోవడంతో ఎక్కువ రోజులు ఆసుపత్రిలోనే ఉంచుతున్నారు. ఆపరేషన్ అయిన తరువాత రెండు మూడు రోజులకు వైద్యులు బాలింతలను వార్డులో నడిపిస్తారు. కుట్లు మానక పోవడం, వాటి నుంచి చీము, రక్తం వస్తుండడంతో బాలింతలు ఆందోళన చెందుతున్నారు. కొందరు ఇంటికి వెళ్లిన తరువాత ఇలాంటి సమస్యలు వస్తుండడంతో బయట ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఆపరేషన్ థియేటర్‌లో నో స్టెరిలైజేషన్...

ఆపరేషన్ థియేటర్‌ను స్టెరిలైజేషన్ చేయాల్సి ఉండగా సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఇన్ఫెక్షన్ సోకుతుంది. ఆటో గ్లౌజ్ బిన్స్‌ను శుభ్రపర్చకపోవడం, ఒకరికి చేసిన ఆపరేషన్ పరికాలను మరొకరికి వినియోగించడం వల్ల చేటు చేసుకుంటుంది. ఆపరేషన్ థియేటర్‌ను ఫార్మిలిన్ క్యాటికేషన్ చేయకపోవడంతో త్వరగా ఇన్ఫెక్షన్ సోకి కుట్ల నుంచి చీము, రక్తం వస్తుంది. థియేటర్‌లో పరిశుభ్రం లేకపోవడం బాలింతలకు శాపంగా మారుతుంది.

వార్డుల్లోకి అధికంగా బంధువులు...

సిజేరియన్ జరిగిన తరువాత బాలింతలను ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు తరలించిన తరువాత వారిని చూడటానికి బంధువులు అధికంగా రావడంతో బాలింతలకు ఇన్ఫెక్షన్ సోకుతుంది. చెప్పులతో నేరుగా వార్డుల్లోకి రావడం వల్ల బయట బ్యాక్టీరియా రోగిపై పడుతుందని, దీంతో కుట్లు మానకపోవడంలో ఇదో సమస్యగా మారింది. సెక్యూరిటీ గార్డ్‌లు ఎంత చెప్పినా వినకపోవడం, వారిపైనే రోగి బంధువులు తిరగబడడంతో వారు కూడా ఏమి చేయలేకపోతున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు తాకిడి...

ఒకప్పుడు గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెలకు 300లకుపైగా ప్రసవాలు జరిగేవి. ఆసుపత్రికి వస్తే కుట్లు మానడం లేదనే ప్రచారంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 100 నుంచి 150కూడా ప్రసవాలు జరుగడం లేదు. దీంతో వెలవెలబోయిన ప్రైవేట్ ఆసుపత్రులకు గర్భిణీల తాకిడి పెరిగింది. దీనికి కారణంగా ఇన్ఫెక్షన్ అని చెప్పవచ్చు.

అటెండెంట్లతోనే ఇన్ఫెక్షన్... ప్రిన్సిపాల్ హిమబిందు

ఆపరేషన్ జరిగిన తరువాత లేబర్ రూమ్, వార్డుల్లోకి అటెండెంట్ల తాకిడి పెరగడంతో తొందరగా ఇన్ఫెక్షన్ సోకుతుంది. ఎంత చెప్పినా వినడం లేదు. మమ్మల్నే బెదిరిస్తున్నారు. కొందరు నాయకులతో ఫోన్లు చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో బ్యాక్టీరియా సోకి తొందరగా ఇన్ఫెక్షన్ గురవుతున్నారు.



దొంగల బీభత్సం

- కోళ్లమద్దిలో తాళం వేసిన ఇంట్లో చోరీ
- 5 తులాల బంగారం, 100 తులాల వెండి, రూ. లక్ష నగదు అపహరణ

గంభీరావుపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కోళ్ళమద్దిలో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇంట్లో చొరబడి భారీ ఎత్తున బంగారం, వెండి, నగదును ఎత్తుకెళ్లారు. కోళ్ళమద్దిలోని లింబయ్య తన బార్య శాంతవ్వ ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి లింబయ్య కుటుంబం 10 రోజులుగా ఆసుపత్రులు తిరుగుతున్నారు. ఇదేక్రమంలో శనివారం రాత్రి దొంగలు లింబయ్య ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. 3తులాల బంగారు పుస్తెల తాడు, తులం చైన్, తులం కమ్మలు, 70 తులాల వెండి కడియాలు, 30 తులాల పట్టి గొలుసులు, లక్ష నగదును దొంగలు ఎత్తుకెళ్ళినట్టు బాదితులు తెలిపారు. స్థానిక ఎస్‌ఐ ప్రేమానందం సిబ్బందితో వెళ్లిదొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు.

వడ్ల లోడ్ ట్రాక్టర్ బోల్తా..

శంకరపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకాయగూడెం శివారులోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం వడ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన ఓరైతు వడ్లను ట్రాక్టర్‌తో మానకొండూర్ శివారులోని ఓ సీడ్‌ప్లాంట్‌కు తరలిస్తున్నాడు. ఈక్రమంలో వంకాయగూడెం చేరుకోగానే టైర్ పంచర్ కావడంతో ఒక్కసారిగా ట్రాక్టర్ రోడ్డున పక్కనపడిపోయింది. ఆ సమయంలో అటుగా ఎవరు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

గుడుంబా పట్టివేత

రామగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్‌లో గుడుంబా అమ్మకాలు చేపడుతున్న మహిళను పోలీసులు ఆదివారంరాత్రి పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన కోటగడ్డల రమాదేవి ఇంటివద్ద గుడుంబా విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి పట్టుకొని మూడులీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని మహిళ పై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పావులు కదిపితే ప్రత్యర్థులు చిత్తే



- చదరంగంలో రాణిస్తున్న క్రీడాకారులు
- జాతీయ స్థాయిలో ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని నిర్ణయించుకొని ముందుకుపోతే ఏ రంగంలోనైనా విజయాలు వరిస్తాయి. పదేళ్లకే జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి తమకంటే మెరుగైన రేటింగ్ ఉన్న క్రీడాకారులపై విజయాలు సాధిస్తున్నారు జిల్లాకు చెందిన చదరంగ క్రీడాకారులు. కరీంనగర్‌కు చెందిన ఇరుకుల్ల శ్లోకాయుక్తా, గంగిరెడ్డి శ్రీహంసిని, లిఖిత్ మాణిక్యరావు, ఐ కాశవేన సుప్రీత్ జాతీయ స్థాయి పోటీల్లో, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఫలితంగా వీరు ఫిడే రేటింగ్‌తోపాటు పలు అవార్డులను సొంతం చేసుకున్నారు.

ఎనిమిదేళ్ల నుంచే పోటీల్లో పాల్గొంటూ..



జిల్లా కేంద్రంలోని కృష్ణా నగర్‌కు చెందిన ఇరుకుల్ల శ్లోకాయుక్తి ఎనిమిది సంవత్సరాల వయస్సు నుంచే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటోంది. అండర్-14, అండర్- 17 ఎస్జీఎఫ్, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలను సాధించింది. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో జరిగిన 68వ జాతీయ స్థాయి అండర్-19 చదరంగ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. హిమాచల్ ప్రదేశ్‌లో జరిగి న 65వ జాతీయ స్థాయి అండర్-14 చదరంగ పోటీ ల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహ రించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతోంది. అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదగాలనేదే తన లక్ష్యమని శ్లోకాయుక్తి చెబుతోంది.

జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించడమే లక్ష్యంగా..



జిల్లా కేంద్రానికి శ్రీహంసిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. కరీంనగర్, హైదరాబాద్, హనుమకొండ, రంగారెడ్డి, నిజామా బాద్ జిల్లాల్లో జరిగిన ఎస్జీఎఫ్, అసోసియేషన్, ఓపెన్, సీఎం కప్ చదరంగ పోటీల్లో పాల్గొన్నది. ఇంతవరకు 13 రాష్ట్రస్థాయి, ఒక జాతీయస్థాయి చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభచాటి పతకాలను సొంతం చేసుకుంది. 2023లో హనుమకొండలో జరిగిన ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి యంగెస్ట్ గర్ల్ అవార్డును సొంతం చేసు కుంది. 2024 సెప్టెంబరులో కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో జరిగిన 37వ జాతీయస్థాయి అండర్-7 బాలికల చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఈ రాష్ట్రానికి పత కం సాధించడమే తన ధ్యేయమని శ్రీహంసిని తెలిపింది.

ఫిడే రేటింగ్ పోటీల్లో ప్రతిభ



కరీంనగర్‌కు చెందిన లిఖిత్ మాణిక్యరావు చిన్ననాటి నుంచే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్నాడు. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్ తదితర ప్రాం తాల్లో జరిగిన ఎస్జీఎఫ్, అసోసియేషన్, ఓపెన్ ఏడు రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. 2024లో హైదరాబాద్‌లో జరిగిన 37 జాతీయ అండర్-11 బాలబాలికల రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొని 57 పాయింట్లు సాధించాడు. హైదరాబాద్‌లోనే జరిగిన మొదటి అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొని మంచి రేటింగ్ సాధించాడు. 2023లో మహారాష్ట్ర లోని పూణేలో జరిగిన అఖిల భారత ఓపెన్ ఫిడే రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొని ఉత్తమ రేటింగ్ సాధించాడు. అంతర్జాతీయ చదరంగ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని లిఖిత్ మాణిక్యరావు అంటున్నాడు.

రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం



కరీంనగర్‌కు చెందిన కాశవేన సుప్రీత్ ఆరు సంవత్సరాలుగా చదరంగంలో శిక్షణ పొందుతున్నాడు. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్ నగర్, ఆదిలాబాద్, తదితర జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్, ఓపెన్ 13 టోర్నమెంట్లలో పాల్గొని ప్రతిభ చాటాడు. 2024లో మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్-17 చదరంగ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతి నిధ్యం వహించాడు. తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరులో 2023 డిసెంబరులో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-14 చదరంగ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచాడు. 2023లో కరీంనగర్ వైశ్య భవన్‌లో జరిగిన అఖిల భారత ఫిడే రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొన్నాడు. ప్రపంచ చదరంగ చాంపియన్ గుకేష్ తనకు ఆదర్శ మని కాశవేన సుప్రీత్ అంటున్నాడు.



న్యాయం చేయాలని..

బాధిత కుటుంబం ధర్నా



కరీంనగర్ అల్కాపురి కాలనీలో ధర్నా చేస్తున్న బాధితులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్ తహసీల్దార్‌కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూఉద్యోగి కొయ్యడ లాస్య, ఆమె భర్త రమేష్ తమ డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని వారి ఇంటి ఎదుట ఆదివారం బాధితులు ధర్నా చేశారు.

బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లికి చెందిన భైరి చిరంజీవి కుటుంబానికి ఉన్న వ్యవసాయభూమి, ఇల్లు గౌరవెల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురైంది. ఆ భూమికి ప్రభుత్వం పరిహారం కింద రూ.60లక్షలు అందజేసింది. డిప్యూటీ తహసీల్దార్ కొయ్యడ లాస్య, ఆమె భర్త రమేష్ సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగాంశివార్లలోని సర్వే నంబర్ 505, 507, 508లో తొమ్మిది ఎకరాల 16గుంట భూమి తమ పేరిట ఉందన్నారు. దానిని విక్రయిస్తామని భైరి చిరంజీవి, ఆయన బావ శ్రీనివాస్‌కు చెప్పారు. దీంతో చిరంజీవికి ప్రభుత్వం అందజేసిన డబ్బులు రూ.60లక్షలతో లాస్య, రమేష్‌కు చెందిన భూమిని కొనుగోలు ఒప్పందం శ్రీనివాస్ పేరిటచేశాడు. డబ్బులు మొత్తం ముట్టజెప్పినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేయడంతో బాధితులు కొద్దిరోజుల కిందట నిల దీశారు. దీంతో ఆ భూమిపై కోర్టులో విచారణ జరుగుతోందని చెప్పారు. కోర్టుకేసులో ఉన్న భూమిని మమ్మల్ని నమ్మించి విక్రయించారని బాధితులు ఆరోపించారు. తాము ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని అడిగితే బెదిరింపులకు పాల్పడు తున్నారని బాధితులు వాపోయారు. ఈ విషయంపై కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రెవెన్యూఉద్యోగి లాస్యతోపాటు ఆమె భర్తపై కేసు నమోదైనట్టు బాధిత కుటుంబానికి చెందిన చొప్పరి శ్రీనివాస్ తెలిపారు. ఉద్యోగం పోతుందని డబ్బులు తిరిగి చెల్లిస్తామని చెప్పిన రమేష్ తనకు చెక్కు ఇచ్చారని, ఆ చెక్కు కూడా రెండుసార్లు బౌన్స్ అయిందని తెలిపారు. అప్పటి నుంచి లాస్య, రమేష్ దంపతులకు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. దీంతో ఆదివారం కరీంనగర్ అలకాపురి కాలనీలోని లాస్య ఇంటి వద్ద నిరసనకు దిగామన్నారు. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి ఆందోళనను విరమింపచేశారు. తమకు అన్యాయం చేసి, మోసానికి పాల్పడిన లాస్య, ఆమె భర్త రమేష్‌పై చట్టపర మైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితులు కోరారు.

జేఎన్టీయూలో రిక్రూట్‌మెంట్ పరీక్షలు



జేఎన్టీయూలో ఫీల్డ్ అసిస్టెంట్ అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఉదయం ఫీల్డ్ అసిస్టెంట్, మధ్యాహ్నం రికార్డు అసిస్టెంట్ పోస్టులకు పరీక్షలు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగాలకు ఫీల్డ్ అసిస్టెంట్‌కు జరిగిన పరీక్షలో 100 మందికిగాను 64 మంది హాజరు కాగ 36 మంది గైర్హాజరైయ్యారు. మధ్యాహ్నం రికార్డు అసిస్టెంట్ పరీక్షలకు 100మందికి గాను 67మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరిఎస్‌ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

కారు ఢీకొని బాలుడు మృతి



శివరాజ్‌కుమార్(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గంగానగర్‌లో ఆదివారం కారు ఢీకొని పులిపాక శివరాజ్‌కుమార్(3) మృతిచెందాడు. బాలుడు ఆడుకుంటుండగా ఇంటిపక్కన ఉండేవ్యక్తి గమనించడకుండా కారు నడపడంతో బాలుడికి తగిలి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. కారు నడిపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌ఐ భూమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టిన మజ్లిస్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టిన బడా చోర్ మజ్లిస్ అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దారుసలాంలో వక్ఫ్ ఆస్తులు కాజేసిన బడా చోర్ నాయకులతో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభఏర్పాటు చేయించారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒక్కటేనన్నారు. మూడు పార్టీలు ముస్లిం ఓట్లు దండుకుని వారిని ఆదుకోకుండా వక్ఫ్ ఆస్తులను దోచుకు తింటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా9లక్షల ఎకరాల వక్ఫ్‌భూముల ద్వారా 10లక్షలకోట్లకు పైగా ఆస్తులున్నా ఏ పేదముస్లింలకు లాభం చేశారో చెప్పా లని డిమాండ్ చేశారు. అంబేద్కర్ వారసులం మేమే నని, రాజ్యాంగ బద్దంగా మోదీప్రభుత్వం పని చేస్తుందన్నారు. హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో ఇప్పటివరకు ఒక్కఅంబేద్కర్ విగ్రహంలేదని, పేద ముస్లింలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో వక్ఫ్ సవరణ చట్టం అమలు చేస్తున్నట్లు వివరించారు.

అకాలవర్షాలు, వడగండ్లవానలతో వేలాది ఎకరాల్లో పంటదెబ్బతిని రైతులంతా అల్లాడుతుంటే ఆదుకోవాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన పేరుతో విదేశాలకు వెళ్లడమే మిటని ప్రశ్నించారు. వక్ఫ్ ఆస్తులను దోచుకున్న బడాచోర్లంతా కలిసి బీజేపీపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబేద్కర్ పెట్టిన భిక్షవల్లే ప్రధాని కాగలిగానని పార్లమెంట్‌లో ప్రకటించిన మహానేత నరేంద్ర మోదీయేనన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో దళిత, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన గొప్ప పార్టీ బీజేపీ అన్నారు. అంబేద్కర్ పేరును ఉచ్చరించే అర్హత కూడా ఒవైసీకి లేదన్నారు. వక్ఫ్ ఆస్తులపై యేటా 12 వేల కోట్ల రూపాయలకు పైగా ఆదాయం వస్తుంటే ఆ సొమ్మునంతా దిగమింగుతోంది మజ్లిస్ కాదా అని



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సంజయ్

ప్రశ్నించారు. ఒక్క తమిళనాడులోనే 2వేలకోట్ల విలువైన వక్ఫ్‌ఆస్తులను ఆక్రమించుకుంది నిజంకాదా అన్నారు. రాముని గురించి ప్రశ్నించే వారికి వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలపై నిలదీసే దమ్ముందా అని ప్రశ్నించారు. ఒవైసీ కుటుంబంతోపాటు మజ్లిస్ నాయకులు, సోకాల్డ్ వక్ఫ్‌బోర్డు సభ్యులంతా వక్ఫ్ ఆస్తులను దోచుకుని ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వ్యా పారసంస్థలు నిర్మించి కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. వక్ఫ్‌భూముల్లో ఒక్క గజం అయినా పేదముస్లింలకు ఇచ్చారా అన్నారు. మేం వాస్తవాలు మాట్లాడుతుంటే వక్ఫ్‌ఆస్తుల్లో హిందువుల జోక్యమా అంటూ మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాను ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వక్ఫ్ ఆస్తులపై విచారణ జరిపించే దమ్ముందా అని ప్రశ్నించారు. ఎన్ని భూములు ఆక్రమణకు గురయ్యాయి, ఒవైసీ కుటుంబం ఎంత దోచుకుంది, వక్ఫ్ ఆస్తులపై ఎంత ఆదాయం వస్తోంది, పేదల సంక్షేమానికి ఎంత ఖర్చు చేశారనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మాజీ ఎంపీ వెంకటేష్‌నేత, పెద్దపల్లి, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, చింతల రామచంద్రా రెడ్డి, నాయకులు పల్లె సదానందం, కందుల సంధ్యారాణి, ఠాకూర్ రాంసింగ్, పర్శ సమ్మయ్య, బెజ్జంకి దిలీప్‌కుమార్, శివంగారి సతీష్, నర్సింగం, జంగా చక్రధర్ రెడ్డి, పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న మహిళ మెడలోని చైన్‌ను కిటికీ నుంచి అపహరించిన దొంగను 12గంటల వ్యవధిలోనే రామకృష్ణాపూర్ పోలీసులు ఛేదించి పట్టుకున్నారు. ఆదివారం రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్ బెల్లం పల్లి ఏసీపీ రవికుమార్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ఇరుముల్ల శరణ్య కిటికీ పక్కన నిద్రిస్తున్న సమయంలో మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు, అదేవిధంగా బుర్ర రాజేంద్రప్రసాద్ అనేవ్యక్తి మొబైల్ ఫోన్‌ను కిటికీలో నుంచి అపహరించి పారిపోయాడు. సంఘటనపై బాధితులు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలను పరీక్షించగా నిందితుడు గుంజ ఇమాన్యుల్‌గా తేలింది. వెంటనే గోదావరిఖని కాకతీయ కాలనీ పరిసర ప్రాం తాల్లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సింగరేణి ఏరియా ఆసుపత్రి చౌరస్తా వద్ద బైక్‌మీద వెళ్తున్న నిందితుడిని తనిఖీ చేశారు. అతని జేబులో సుమారు మూడుతులాల పుస్తెలతాడు, ఒక మొబైల్‌ఫోన్ దొరకడంతో నిందితుడిని అదుపులోకి తీసు కున్నారు. నేరస్తుడు గుంజ ఇమాన్యుల్ గోదావరిఖని కాకతీయ కాలనీకి చెందినవాడు. గతంలో పలు చోరీ కేసుల్లో అరెస్ట్ అయి ఇటీవల విడుదలయ్యాడు. మళ్లీ దొంగతనం చేస్తూ పోలీసులకు పట్టుబడినట్టు ఏసీపీ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్‌ఐ రాజశేఖర్, కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్, క్రైం టీం సిబ్బందికి సీపీ అభినందించి వారికి రివార్డు అందజేశారు.

కారును ఢీకొన్న లారీ

- తొమ్మిది మందికి గాయాలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పొలాస శివారులో ఆదివారం ఎర్టీగా కారును లారీ ఢీకొనడంతో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా దివాల్‌పూర్ గ్రామానికి చెందిన విస్తాపురం భూమేష్, కోడె మధు, శ్రీరాం, మున్నా, ప్రణీత, రిషి, విశ్వనాథ్, నర్సయ్య, మరో వ్యక్తి కారులో ధర్మపురి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి జగిత్యాల వైపు వస్తుండగా లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. క్షతగాత్రుడు కదం శ్రీరాం ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి



సంధ్య (ఫైల్)

హుజూరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కుమ్మరివాడకు చెందిన గన్నారపు సంధ్య (33) అనే అంగన్‌వాడీ టీచర్ అనారోగ్యంతో మృతిచెందింది. సంధ్య కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. సంధ్యమృతిపట్ల సీడీపీవో సుగుణ, సూపర్‌వైజర్లు పద్మ, రాజశ్రీ, శిరీష, రమాదేవి, స్వరూప, జ్యోతి, శ్యామల, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

అప్పుల బాధతో గీత కార్మికుడి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

ఓదెల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఓదెల మండలం పొత్కపల్లికి చెందిన సూదగోని తిరుపతి గౌడ్ (50) అనే గీత కార్మికుడు శనివారం రాత్రి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం పొత్కపల్లికి చెందిన తిరుపతి గౌడ్ ఏడేళ్ల క్రితం హైదరాబాద్ వెళ్ళి ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. కూతురు వివాహానికి అప్పులు చేసి తిరిగి చెల్లించలేక మానసిక ఇబ్బందులతో మనస్తాపం చెంది పొత్కపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రమాదేవి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలంలో ట్రాక్టర్ ఢీకొని రైతు మృతి



రాజిరెడ్డి(ఫైల్)

ఓదెల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లిలో ఆదివారం వరిపంట కోయించేందుకు వెళ్లిన ఎడవెల్లి రాజిరెడ్డి(80) అనేరైతు ట్రాక్టర్‌ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. వరిపంటను హార్వెస్టర్‌తో కోయించేందుకు వెళ్లగా డ్రైవింగ్‌లో అనుభవంలేని వ్యక్తిట్రాక్టర్‌ను వెనకకు తీయడంతో రాజిరెడ్డి ట్రాక్టర్ కిందపడి నలిగి మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై రమేష్ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. మృతుడికిభార్య, ఇద్దరు కూతుళ్ల, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఎస్‌ఐ రమేష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

- భువనగిరి జిల్లాలో ఘటన
- మృతుడు మామిడిపల్లివాసిగా గుర్తింపు

కోనరావుపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన మండలంలోని మామిడిపల్లికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని పొడిచేడు గ్రామంలో మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పొడిచేడు గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి(40) కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలోనే భార్యాపిల్లలను వదిలేసి ఎక్కడికి పడితే అక్కడికి వెళ్లడం అలవాటుగా మారింది. అదేక్రమంలో శనివారం రాత్రి పొడిచేడు వద్ద బస్సు దిగి బస్‌స్టాప్‌లో పడుకున్నాడు. అపరిచిత వ్యక్తి బస్ షెల్టర్‌లో తచ్చాడుతున్న విషయాన్ని గమనించి ఆరా తీయగా మద్యం మత్తులో ఉన్న వ్యక్తి సరైన సమాధానాలు చెప్పలేదు. ఉదయం గ్రామస్తులు అతడి దగ్గరకు వెళ్లి చూడగా చనిపోయినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వచ్చి అతని సెల్‌ఫోన్ ద్వారా అతనికి సంబంధించిన సమాచారాన్ని వాకబు చేశారు. భార్య, బంధువుల కోరిక మేరకు మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోత్కూర్ పోలీసులు తెలిపారు.

కర్రలే విద్యుత్ స్తంభాలు



మారేడుపల్లిలో కర్రలపై విద్యుత్ తీగలు

ఎండపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలంలోని మారేడుపల్లి గ్రామంలో కర్రలే విద్యుత్ స్తంభాలుగా మారాయి. ప్రమాదమని తెలిసినా విద్యుత్‌అధికారులు పట్టించుకోవడం లేదు. ఈదురుగాలులకు కర్రలు కింద పడే అవకాశం ఉంది. కోత సమయం లో, పొలం నాటు సమయంలో దీనివల్ల ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్ క్లస్టర్ సర్వీస్ క్యాంపులు

భగత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఆధ్వర్యంలో మంగళవారం క్లస్టర్ సర్వీస్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) పొన్నం అజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్లకు వారి సమస్యలపై తక్షణమే పరిష్కారాన్ని చూపిస్తామన్నారు. మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో టెలిఫోన్ భవన్ కరీంనగర్, టెలిఫోన్ ఎక్సేంజి జగిత్యాల, టెలిఫోన్ ఎక్సేంజి హుజూరాబాద్, టెలిఫోన్‌ఎక్సేంజి గోదావరిఖనిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు సర్వీస్ క్యాంపులు ఉంటాయన్నారు. ఈఅవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకుని సంస్థకు విలువైన అభిప్రాయాలు అందించి మెరుగైన సేవలకు తోడ్పడాలని కోరారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లో కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన వరి, మామిడి పంటలకు తీరనినష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం పూర్తిగా తడిచిపోయిందని తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న మామిడికాయలు రాలి రైతులకు పెనునష్టం వాటిల్లిందన్నారు. ఒక్క కోరుట్ల నియోజకవర్గంలోనే 12వేల ఎకరాల్లో వరి, మామిడి, మొక్కజొన్న, నువ్వులు, సజ్జపంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో 6వేలఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. అలాగే జగిత్యాల జిల్లాలోని మిగతా మండలాల్లోనూ పంట నష్టంవాటిల్లిందని, అకాల వర్షాలు, ఈదురు గాలులకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



పారాహుషార్

- వేసవిలో అధికంగా చోరీలు
- ఇంటికి తాళం కనపడితే దొంగతనం
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులంటే పిల్లలతోపాటు తల్లిదండ్రులకు కొంత వెసులు బాటు. స్వగ్రామాలకు వెళ్లడంతోపాటు విహార యాత్రలు, పుణ్యక్షేత్రాల సందర్శనకు వేసవి సెలవు ల్లోనే అవకాశం లభిస్తుంది. ఇదే అదునుగా భావించి దొంగలు ఎక్కువగా చోరీలకు పాల్పడతారు. ఇటీవల కాలంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పదిహేను రోజుల కిందట రెండు రోజుల వ్యవధిలో 12 ఇళ్లలోనూ, ఒక మిర్చియార్డులోనూ చొరబడిన దొంగలు లక్షల రూపాయల సొత్తును లూటీ చేశారు. శంకరపట్నం మండలం లింగాపూర్‌లో తాళాలు పగులగొట్టి ఎనిమిది ఇళ్లలో భారీగా బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదు, బైక్ ఇతర విలు వైన వస్తువులను ఎత్తుకెళ్లారు. ఒకరోజు విరామం ఇచ్చిన దొంగలు మానకొండూర్ మండలం అన్నారం గ్రామంలో నాలుగు ఇళ్లలో చొరబడి బంగారం, వెండి, నగదు, బైక్‌లను చోరీ చేశారు.

తాజాగా నగరంలోని సప్తగిరి కాలనీలో మెస్‌డోర్‌లు మాత్రమే బిగించిన ఒక ఇంటిలో అదనుచూసి భారీగా బంగారం, నగదు దొంగి లించుకుపోయారు. పట్టణాల్లో పగటి పూట రెక్కీ నిర్వహిస్తూ టార్గెట్‌గా చేసుకున్న ఇళ్ల వద్ద పరిసరాలను పూర్తిగా అవగాహన చేసుకుంటున్నారు. అర్ధరాత్రి సమ యాల్లో అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఇళ్లల్లోకి చొర బడి చోరీకి పాల్పడుతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఇళ్లకు తాలం వేసి వ్యవసాయ పనులకు వెళ్లడంతో పగటి పూటనే ఇళ్లు లూటీ చేస్తున్నారు. ఒక వైపు బ్లూకోల్ట్స్ పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగానే మరో వైపు దొంగలు చోరీలకు పాల్పడుతుండడం ఆందోళనకు గురి చేస్తోంది. దొంగతనాలు జరిగిన తరువాత పోలీసులు విచారణ చేపట్టి సీసీ కెమెరాలు, వేలిముద్రల ఆధారంగా దొంగలను అరెస్టు చేస్తున్నా బాధితుల సొమ్ము పూర్తిగా రికవరీ కావడం లేదు. కొన్ని సంఘ టనల్లో దొంగలు వేలి ముద్రలు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు, చేతికి టవల్ కట్టుకొని తలుపులు, బీరువాలు తెరుస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

ప్రజలు కూడా సరైన భద్రతా చర్యలు తీసుకోవడం లేదని, దొంగతనాలను అరికట్టడంలో పోలీసులకు సరైన విధంగా సహకారం అందివ్వడం లేదని పోలీసులు పేర్కొంటున్నారు. దొంగతనాల నియంత్రణకు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలని కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి ఒక ప్రకటనలో కోరారు.



తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవికాలంలో రాత్రిపూట ప్రజలు వీలైనంత వరకు ఇంట్లోనే నిద్రించేలా చూసుకోవాలి.
- ఆరుబయట నిద్రిస్తే ఇంటి ప్రధాన తలుపు, ఇతర కిటికీలు గట్టిగా మూసి ఉన్నాయని, గొళ్లెం వేసి ఉందని నిర్ధారించుకోవాలి.
- నగలు, డబ్బు, ఇతర విలువైన వస్తువులను ఇంటిలో సురక్షితమైన స్థలంలో లేదా లాకర్‌లో ఉంచాలి.
- రాత్రిపూట ఇంటి పరిసరాల్లో లైట్లు వెలుగుతూ ఉండేలా చూసుకోవాలి. ఇంట్లో మనుషులు ఉన్నట్లు ద్వారాల వద్ద చెప్పులు ఉంచాలి.
- చీకటి ప్రదేశాలు దొంగలకు అనువుగా ఉంటాయి. ముఖ్యంగా కదలికలను గుర్తించే సెన్సార్‌లైట్లు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- రాత్రిపూట గేట్లు మూసి ఉన్నాయని నిర్ధారించుకోవాలి.
- ఇంటికి తాళం వేసినట్లు కనిపించకుండా కర్టెన్‌ను చాటుగా ఉంచాలి.
- అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనిస్తే వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలి.
- ఒకే చోట ఎక్కువ మంది గుంపుగా నిద్రపోవడం దొంగలకు సులువుగా ఉంటుంది, వీలైతే వేర్వేరు ప్రదేశాల్లో నిద్రించాలి.
- దొంగతనం జరిగితే, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- ఇరుగుపొరుగు వారితో సత్సంబంధాలు కలిగి ఉండాలి. ఒకరినొకరు సహకారం తీసుకోవాలి. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తేఒకరికొకరు తెలియజేసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దీంతో దొంగలను గుర్తించడం, పట్టుకోవడం సులభమవుతుంది.
- ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వేసవిలో దొంగతనాలను నివారించవచ్చు.

ఆపద్బాంధవుడు..

- రక్తదానంలో ఎల్లారెడ్డిపేట యువకుడి ఆదర్శం
- యాభైసార్లు పూర్తి.. పలువురి ప్రశంసలు



రక్తదానం చేస్తున్న గిరిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో రక్తం లభించక నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోవడాన్ని చూసి ఆ యువకుడు తట్టుకోలేకపోయాడు. రక్తలేమితో బాధపడుతున్న రోగులకు రక్తదానం చేస్తున్నాడు. ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన యువకుడు వంగ గిరిధర్‌రెడ్డి.

- పది అవార్డులు..

రక్తలేమి, శస్త్రచికిత్స సమయంలో రక్తం లభించక ప్రాణాలు కోల్పోతున్న వారిని చూసి మండల కేంద్రంలోని వంగ గిరిధర్‌రెడ్డి చలించిపోయాడు. 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లో గాంధీ జయంతిని పురస్కరించుకుని మొదటిసారి రక్తదానం చేశాడు. 2005లో స్థానికంగా సహాయ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పాడు. ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేసి వివిధ స్థాయిల్లో 10 అవార్డులు అందుకున్నాడు. రక్తదానం సేవలను విస్తరింపజేసేందుకు తన సంస్థ ద్వారా యువకులకు అవగాహన కల్పిస్తున్నాడు.

మిత్రులు, బంధువులను ప్రోత్సహిస్తున్నాను..

గిరిధర్‌రెడ్డి

రక్తదానం విషయంలో ప్రతిఒక్కరూ అపోహలు వీడాలి. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడటం మన బాధ్యత. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలి. ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 65 ఏళ్లలోపు రక్తదానం చేయవచ్చు. నా ఆరోగ్యం సహకరించే వరకు రక్తదానం చేస్తా. మిత్రులు, బంధువులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నాను.



సినీ నటుడు పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, సినీ నటుడు చిరంజీవి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గిరిధర్‌రెడ్డి (ఫైల్)

యువకుడి కిడ్నాప్ కలకలం

- రూ.7లక్షలు డిమాండ్
- తండ్రి దగ్గర డబ్బు వసూలుకు కుమారుడి నాటకం?
- సికింద్రాబాద్‌లో పట్టుకున్న పోలీసులు



లక్ష్మీరాజం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కోరుట్లరూరల్ మండలం గుమ్లాపూర్‌లో మందలక్ష్మీరాజం(23) అనే యువకుడి కిడ్నాప్‌కలకలం సృష్టించింది. బాధిత కుటుంబ సభ్యులుతెలిపిన వివరాలప్రకారం.. గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మంద గంగారాజం కుమారుడు మంద లక్ష్మీరాజం ఈనెల 19వ తేదీన తనఫోన్‌తోపాటు తండ్రి ఫోన్‌ను పట్టుకొని ఇంటినుంచి ద్విచక్రవాహనంపై బయటకువెళ్లాడు. ఈక్రమంలో 19న లక్ష్మీరాజం ఫోన్ నుంచి అతడి చిన్నాన్న మంద వెంకటికి తన అన్నకుమారుడిని కిడ్నాప్ చేస్తున్నామని రూ.7 లక్షలు కావాలని డిమాండ్‌చేశారు. ఆ విషయాన్ని వెంకటి తన అన్న గంగారాజంకు చేరవేశాడు. గంగారాజం తనఫోన్ గురించి ఇంట్లో వెతగ్గా దొరక్కపోవడంతోపాటు తన కుమారుడు ఇప్పటివరకు ఇంటికి రాలేదని వెతకడం ప్రారంభించాడు. చివరికి లక్ష్మీరాజం ద్విచక్ర వాహనం కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉండడం గమనించారు. ఆదివారం ఉదయం మరో నంబర్ నుంచి చిన్నాన్న వెంకటికి మరోమారు మెసేజ్ వచ్చింది. ప్రస్తుతం రూ.30వేలు పంపాలని సాయత్రం వరకు మిగతా డబ్బులు జమ చేయాలని లేకుంటే మీ కుమారుడిని చంపివేస్తామని మెసేజ్ చేశారు. దీంతో ఇద్దరు అన్నదమ్ములు మెస్సేజ్ వచ్చిన నంబర్‌కు రూ.30వేలు జమ చేసి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి గంగారాజం, లక్ష్మీరాజం ఫోన్ నంబర్ల లోకేషన్ పరిశీలించగా సికింద్రాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో కోరుట్ల ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకొని విచారణ చేపట్టారు. ఆదివారం రాత్రి లక్ష్మీరాజం ఓలాడ్జిలో ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. కాగా లక్ష్మీరాజం వెంబడి ఎవరూ కిడ్నాపర్లు లేకపోవడంతో తండ్రి వద్ద డబ్బులు వసూలు చేయడానికి కిడ్నాప్ డ్రామా ఆడినట్లుగా తెలుస్తోంది. లక్ష్మీరాజంను పోలీసులు కోరుట్లకు తీసుకువచ్చారు. కిడ్నాప్‌నకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కానున్నాయి.

భక్త జనసంద్రంగా రాజన్న ఆలయం

- స్వామివారి దర్శనానికి రెండు గంటల సమయం



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



గణేష్‌వద్ద పూజలో పాల్గొన్న ఆది శ్రీనివాస్-వనజ దంపతులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయం భక్తజన సంద్రంగా మారింది. ఆదివారం సెలవు రోజు కావడంతో వేములవాడకు భక్తులు భారీగా తరలివచ్చారు. రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఉదయం భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారుగా రెండుగంటలపాటు బారులు తీరారు. శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. అనంతరం రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవోవినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాజన్న సేవలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దంపతులు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దంపతులు ఆదివారం దర్శించుకు న్నారు. ఆది శ్రీనివాస్ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్నదర్శనానికి వచ్చారు. ఆలయఅర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

వరి కొయ్యలను కాల్చితే.. నష్టమే

- కాలుష్యం పెరుగుతుంది
- భూమిలోని పోషకాలపై తీవ్ర ప్రభావం
- భూమిలో కలియదున్నితే పంటలకు ఎంతో మేలు



చొప్పదండి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రైతులు.. సాధారణంగా వరి పంట కోసిన తరువాత కొయ్యలను కాల్చివేస్తారు. అలా వరికొయ్యలను కాల్చితే భూమిలోని పోషకాలపై తీవ్రప్రభావం చూపుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. భూమిలోని పోషకాలు తగ్గి దిగుబడి పడిపోయి పంటకు మేలుచేసే పోషకాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం ఆవిరైభవిష్యత్తులో పంటల దిగుబడిపై ప్రభావం చూపుతాయి. వాయుకాలుష్యం వల్ల రైతు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. వరికొయ్యలను కాల్చ కుండా పొలంలోనే కలియ దున్నితే భూ సారం పెరిగి దిగుబడి పెరుగుతుంది. గతంలో రైతులు పంటల అవశేషాలను, చెత్తా చెదారం, పత్తికట్టె, వరి కొయ్యలను తగులబెట్టకుండా భూమిలోనే దున్నేవారు. ప్రస్తుతం వరికోత యంత్రాల ద్వారా కోస్తుండడంతో కొయ్య పొడవుగా ఉండడం చేత మురగడానికి సమయం పడుతుం దని రైతులు కాల్చి వేయడానికే మొగ్గు చూపుతున్నారు. దీంతో ఎరువులు చల్లినా సరైన పంట దిగుబడి రావడం లేదు. రైతులు ఏటా వరి కొయ్యలను తగల బెడుతుండగా పర్యావరణం, వాతావరణంలో మార్పులు వస్తున్నాయి.

వరికొయ్యలకు నిప్పు పెట్టడంతో కలిగే నష్టాలు..

వరికొయ్యలను కాల్చడంతో వాయుకాలుష్యం పెరుగుతుంది. వాతావరణ కాలుష్యం పెరిగి విపరీతమైన వేడితో పంట భూమి సారాన్ని కల్పోతుంది. నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి పంటదిగుబడి తగ్గిపోతుంది. భూమికి పీచుపదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలానికి మేలుచేసే క్రిమికీటకాలు నశించి భూసారం తగ్గిపోతుంది. వానపాములు(ఎర్రలు), అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చనిచెట్లు కూడా ఒక్కోసారి కాలిపోతాయి. అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది.

భూసారం పెంపునకు దోహదం

వరికొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి పంట దిగుబడులు 5నుంచి 10 శాతం పెరిగే అవకాశముంది. నేలలో గడ్డిని కలియదు న్నడం వల్ల సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుం ది. భూ సారంతోపాటు దిగుబడులు పెరిగి రైతులకు మేలు జరుగుతుంది. దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి, పోషకాలుగా మారి డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. కొయ్యలను దున్నడం వల్ల ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవు తుంది. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మ దాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి. నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది. కొయ్య కాళ్లను భూమిలో కలియ దున్నితే, గడ్డి ద్వారా పోషకాలన్నీ తిరిగి నేలకు చేరుతాయి.

వరికొయ్యలను కాల్చవద్దు: వంశీకృష్ణ, ఏవో, చొప్పదండి



వరిపంటలో కొయ్యకాలు కాల్చడం వలన భూమిలో ఉన్న పంటకు మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయి. పంటకు అందవల్సిన పోషకాలు అందకుండా నత్రజని, భాస్వరం, పొటాషియం లాంటి పోషకాలు తగ్గి భూమి యొక్క నెల నిర్మాణం చెదిరి పోతుంది. సేంద్రియ కార్బన్ తగ్గిపోయి పంట దిగుబడి తగిపోతుంది. వాయు కాలుష్యం పెరగడంతో వాతావరణంలో మార్పులు వస్తాయి. రైతులు వరికొయ్యలు కాల్చే బదులు రోటరీ మాల్చర్ ద్వారా పొలాన్ని దున్ని, ఎకరానికి 100కిలోల సూపర్ ఫాస్పేట్ చల్లుకోవడం ద్వారా కొయ్యకాలు మురిగి పంట దిగుబడి పెరుగుతుంది.

ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలకు స్పందన

- 250 మంది క్రీడాకారుల హాజరు



హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికల్లో పోటీపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్‌జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లాకేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ మైదానంలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడిజిల్లాలోని వివిధప్రాంతాల నుంచి 250మందిక్రీడాకారులు హాజరయ్యారు. వీరినుంచి సీనియర్ మహిళల ఎంపిక పోటీలతోపాటు సౌత్‌జోన్ పురుషుల, మహిళల ఎంపికపోటీలను కూడా నిర్వహించారు. ఈ ఎంపికపోటీల్లో ప్రతిభచాటిన ఉమ్మడి జిల్లాజట్లకుఎంపికైన క్రీడాకారులు ఈనెల29 నుంచి 30వరకు ఆదిలాబాద్ జిల్లా మంద మర్రిలో జరిగే 54వరాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు. అంతకుముందు కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ యాదగిరి సుజిత్‌రావు ముఖ్య అతిథిగా హాజరైపోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయిపోటీల్లో జిల్లాక్రీడాకారులు విశేష ప్రతిభచాటి చాంపియన్లుగా నిలిచేందుకు కృషిచేయాలన్నారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని, నిత్య జీవితంలో క్రీడలను ఒకభాగంగా చేసుకోవాలని సూచించారు. ఈపోటీలను జిల్లాహ్యాండ్ బాల్‌అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్లవెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో సంఘ సంయుక్తకార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, దాసరి మల్లేష్, పెద్దపల్లి జిల్లా బాధ్యుడు సురేందర్, సిరిసిల్ల జిల్లాబాధ్యుడు కృష్ణహరి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, తిరుమలేష్, విజయ్, సూర్య, అమర్‌సాయి, శివాజీ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సత్యంజీ

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్థితి మెరుగుపర్చుకోవాలని వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన మంత్రి సత్యంజీ అన్నారు. ఆదివారం శారదానగర్‌లోని విశ్వహిందు పరిషత్ భవనంలో విశ్వహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తయిన మహిళకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మహిళలు ఆర్థికంగా నిలబడాలని, గృహిణిలు ఇంట్లో ఉంటూ కుట్టుశిక్షణ ద్వారా ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చుకోవాలన్నారు. హిందు ధర్మాన్ని, సాంస్కృతిక సాంప్రదాయాలను పిల్లలకు అందించాలన్నారు. వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, నాయకులు రవీందర్, ట్రస్ట్ శిక్షకురాలు ఆరెల్లి మమత, లలిత, వీణ, కోట తిరుమల, స్వప్న, ఇందిర, శ్రీవాణి, శ్రావణి, సుజాత, రమ్య, సత్యశ్రీ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

ఎలిగేడు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం డాక్టర్ రత్నా కర్, మలిహసద్దీఖీలు అన్నారు. నారాయణపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఆదివారం పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పర్యటిస్తూ పసిపిల్లల్లో పుట్టుకతో వచ్చిన పలురకాల వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జూలై 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిశువు పుట్టిన వెంటనే ఆరోగ్య స్థితిగతులను శారీరక వైకల్యం ఆకస్మిక కదలికలు వినికిడి లోపాలను గుర్తించాలన్నారు. ఫార్మసిస్టు అబిబా, ఏఎన్‌ఎం మౌనిక అంగన్వాడీ టీచర్లు సూర్యకళ, కళావతి, హేమలత, సరస్వతి పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి



క్రికెట్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మనాలి ఠాకూర్

పాలకుర్తి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మక్కాన్‌సింగ్ సేవ సమితి చైర్‌పర్సన్ మనాలిఠాకూర్ అన్నారు. ఆదివారం బసంత్‌నగర్ వర్కర్స్ క్లబ్ మైదా నంలో రాజన్న ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. ఎస్‌ఐ ఆర్ స్వామి, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, మాజీ ఎంపీపీ రమేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, నాయకులు సూర సమ్మయ్య, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, భాగ్యలక్ష్మి రవిందర్, పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

మంథని, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. మంథని ఫైర్ ఆఫీసర్ శివశంకరవరప్రసాద్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి సిబ్బంది వారం రోజుల పాటు అగ్నిప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు. డ్యూటీలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించి గౌరవ సూచకంగా మౌనం పాటించారు. ఎల్‌ఎఫ్‌ఎంలు సదానందం, దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠపతి ఆశయ సాధనకు కృషి



వైకుంఠపతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సాధనలో కీలక పాత్ర పోషిస్తూ పదిహేను వందల రోజులకు పైగా నిరాహార దీక్ష శిబిరాన్ని నడిపిన పారుపల్లి వైకుంఠపతి ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని నాటి ఉద్యమ కారులు అయన అభిమానులు పిలుపుని చ్చారు. తెలంగాణ చౌరస్తా వద్ద వైకుంఠపతి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, గెల్లు శ్రీనివాస్, వంగల ప్రభాకర్, నరేందర్, ఉల్లంగుల శ్రీనివాస్,తాహెర్, ఎల్ రావు, ప్రభాకర్ గౌడ్, వెంకటేశ్ పటేల్, ఏకశిల శ్రీనివాస్, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థుల బృందం

ఓదెల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో1999- 2000 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 120 మంది విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని తమ చిన్ననాటి తీపి గుర్తులను స్మరించుకుని ఉద్వేగానికి గురయ్యారు. నాటి ఉపాధ్యాయులు మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, విజయకుమార్, మంద సమ్మయ్య, రాజేశం, సతానియల్, సదానందం, పోచాలు గిరిదర్ తదితరులను సత్కరించారు.

ఆర్థిక సహాయం

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కట్కూరి విష్ణువర్దన్ రెడ్డి మృతి చెందగా ఆయన కుటుంబానికి 1997 - 98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.18 వేలు అందజేశారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని కలసి ఆర్థిక సహాయం అందజేశారు. వీరయ్య, రహీం, నవీన్, తిరుపతి, ప్రవీణ్, రామచంద్రం, అశోక్, మొగిలి పాల్గొన్నారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

ఎలిగేడు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టం 2025పై అవగాహన సదస్సు జరగనుంది. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎండి.బషీరోద్దిన్ తెలిపారు. ఈ మేరకు మండంలోని 12 గ్రామాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో వారివారి సూచనలు, సలహాలు తెలిపి నివృత్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆయనతో మండల వ్యవసాయ శాఖ అధికారి ఉమాపతి ఉన్నారు.

రైతులను ఆదుకునేందుకే సన్నాలకు బోనస్

జూలపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకునేందుకే సన్నాలకు ప్రభుత్వం బోనస్‌ను అందిస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దాపూర్, తెలుకుంట, చీమలపేట, నాగులపల్లి గ్రామాల్లో ఆదివారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి కోతలు ఉండవని, తూకం వేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రైతులను నిండా ముంచారని విమర్శించారు. ఏవో ప్రత్యూష, ఎలిగేడు విండో చైర్మన్ విజయబాస్కర్‌రెడ్డి, నాయకులు బొజ్జ శ్రీనివాస్, కొమురయ్య, స్వామి, అంజయ్య, దుగ్యాల సంతోష్‌రావు, బొట్ల వెంకటేశం, ఈర్ల స్వామి పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు అన్నారు. సుద్దాలలో కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ప్రకాశ్ రావు మాట్లాడుతు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాలలో ధాన్యం విక్రయించుకుని మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలన్నారు. కాసర్ల అశోక్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, డిల్లీశ్వర్‌రావు, అమీనొద్దీన్, రమేష్, సంపత్ పాల్గొన్నారు.

అలాగే కనుకుల రామునిపల్లి, అల్లీపూర్, మద్దికుంట గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సొసైటీ చైర్ పర్సన్ కోట వీణ రాజు, మహిపాల్ రెడ్డి, సీఈఓలు శంకరయ్య, రమేష్, డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లపల్లి, కిష్టంపేట, ఎదులాపూర్, జాఫర్‌ఖాన్‌పేట, కూనారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో సొసైటీ చైర్మన్‌లు గజవెళ్లి పురుషోత్తం, రాంచంద్రారెడ్డిలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సోమవారం నుంచి కొనుగోలు జరుగుతుందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, సింగిల్‌విండో సొసైటీ సీఈవోలు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సాదాబైనామాలకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

తీసుకునేవారు. మోఖాపై భూమిని స్వాధీనపర్చుకున్నప్పటికి రెవెన్యూ రికార్డుల్లో భూ హక్కులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందకుం డా పోయేవి. ఆర్వోఆర్ చట్టం వచ్చిన తర్వాత సాదా బైనామాలు క్రమబద్ధీకరించారు. ధరణి వచ్చిన తర్వాత వాటికి పరిష్కారం లభించలేదు.

ఎల్‌ఆర్‌యూపీ తర్వాత ఇబ్బందులు..

రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం ల్యాండ్ రికార్డు అప్డేషన్ ప్రోగ్రామ్ (ఎల్‌ఆర్‌యూపి) తెచ్చింది. ఇందులో భాగంగా అన్ని రికార్డులను డిజిట లైజ్ చేయడంతో పాటు ధరణి చట్టం ద్వారా కొత్త పాసు పుస్తకాలు జారీ చేసింది. ఆ సమయంలో చాలా పొరపాట్లు జరిగాయి. భూ విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు రావడం, ఒకరి సర్వే నంబర్‌లోని భూమి మరొకరి పేరిట నమోదయ్యాయి. కాస్తు ఎత్తివేయడంతో అనుభ వంలో ఉన్న వారు అధికారికంగా హక్కులు కోల్పోయి, పట్టాదారుల పేర్లపై పాసుబుక్కులు రావడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కాస్తుదారుల కాలంలో ఉన్న వారితోపాటు, సాదాబైనాల ద్వారా ఆస్తులు కొనుగోలు చేసిన వారు కూడా తర్వాత ఇరకాటంలో పడ్డారు. పోర్టల్‌లో తప్పుగా పేర్లు నమోదు కావడంతో కొందరు ఈ ఆస్తులను ఇతరులకు విక్రయించడం ద్వారా కోర్టుల వెంట తిరుతుగుతున్నారు. ఒకసారి భూమి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుంటే ఆ భూములపై ఎవరైనా అభ్యంతరాలు చెప్పినా కూడా రిజిస్ట్రేషన్లు ఆగలేదు. రెవెన్యూ కార్యాలయాల్లో మాన్యు వల్ రికార్డులకు అవకాశం లేకుండా చేశారు. వీటిన్నింటిని సవరించి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చింది. దీంతో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు, ఇతరులు భావిస్తున్నారు.

ఘనంగా చంద్రబాబునాయుడు జన్మదినం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్‌లో టీఎన్‌టీయూసీ కార్యాలయంలో పార్టీ మాజీ రాష్ట్ర నాయకులు నిమ్మకాయల ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వేజెండ్ల కిషోర్‌బాబు కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. మహ్మద్ అలిష్, మనిరామ్ సింగ్, ముదిగంటి దామోదర్‌రెడ్డి, భాస్కర్‌చారి, రాజు, బేక్కం వీరేందర్, బాణమ్మ, నారెడ్డి స్వరాజ్యం, మాటేటి లక్ష్మీ, కళావతి పాల్గొన్నారు. గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు కోటగిరి పాపయ్య కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక బస్టాండ్ డిపో సమీపంలోని వెంకటేశ్వర్‌స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సంగెపు రాజు, ఎండి వాజిద్, గుండబోయిన ఓదెలు, చిటికెల రాజలింగం, పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పారిశుధ్య కార్మికులకు మంచినీటి బాటిళ్ల పంపిణీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రామగుండం నగర పాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మాజీ స్పీకర్ శ్రీపాద రావు స్మారకార్థం ఆదివారం మంచినీటి బాటిళ్లను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పంపిణీ చేశారు. లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో మంచినీరు అందుబాటులో ఉండడం అత్యంత అవసరమన్నారు. పలువురు వ్యక్తులు శ్రీపాదరావు సేవలను గుర్తు చేసుకున్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, నాయకులు మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, మారెల్లి రాజిరెడ్డి, గట్ల రమేష్, తానిపర్తి గోపాల్‌రావు, గంగ శ్రీనివాస్, ముస్తాఫా, పెద్దెల్లి ప్రకాష్, కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని నారాయణ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి 2024-25 విద్యా సంవత్సరంలో సీనాప్స్, ఒలింపియాడ్, ఐఎస్‌ఎంట పోటీ పరీక్షలలో ప్రతిభ కనబర్చారు. శనివారం హైద్రాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఖని నారాయణ బ్రాంచికి చెందిన ఐదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు జీఎం గోపాల్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కరీంనగర్ జోన్ ఏజీఎం చైతన్యరావు, కోఆర్డినేటర్ శ్రావణి, ప్రిన్సిపాల్ రజిని పాల్గొన్నారు.

క్యాత్‌ల్యాబ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

గోదావరిఖని, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఏరియా ఆసుపత్రిలో నిర్మిస్తున్న క్యాత్ ల్యాబ్ పనులను ఆదివారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాత్ ల్యాబ్ లేకపోవడంతో చాలా మంది గుండెపోటుకు గురైన సమయంలో సరైన చికిత్స అందక మృతి చెందుతున్నారని, వైద్య పరీక్షల కోసం కరీంనగర్, హైదరాబాద్, వరంగల్ వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. క్యాత్ ల్యాబ్ పనులు వేగవంతం చేసి త్వరలో వినియోగంలోకి తీసుకువస్తే అత్యవసర పరీక్షలు, శస్త్ర చికిత్సలు ఇక్కడనే అందుబాటులోకి వస్తాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న ఈ క్యాత్ ల్యాబ్ ఏర్పాటు చేయడం వల్ల ఎంజియోగ్రామ్, ఎంజియోబ్లాస్ట్ శస్త్ర చికిత్సలు ఇక్కడనే నిర్వహించవచ్చునన్నారు. బొంతల రాజేష్, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాష్, ముస్తాఫా, శ్రీనివాస్, మారెల్లి రాజిరెడ్డితో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలతో విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్పందన మోడల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఆదివారం సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా పట్టాలను అందజేశారు. అతిథులుగా జబర్దస్త్ ఆర్టిస్ట్ వర్షని వర్షిణి, గైనకాలజిస్టు డా. నీలిమగౌడ్, లయన్స్ క్లబ్ కమాన్‌పూర్ ప్రెసిడెంట్ సానా రామకృష్ణారెడ్డిలు హాజరయ్యారు. విద్యా సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెడల్స్‌ను బహూకరించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కరస్పాండెంట్ ఓదెలు, ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రావులతో పాటు ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25 ఏండ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1999 నుంచి 2000వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అప్పటి జ్ఞాపకాలలో గడిపారు. ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరి వారి అనుభవాలను తెలుసుకున్నారు. 25సంవత్సరాల తర్వాత ఒక్కచోట కలుసుకోవడంపై అప్పటి విద్యార్థులు ఆనందంతో గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు మల్లేశం, మాధవరెడ్డి, గోవర్ధన్, శ్రీనివాస్, విజయసేనారెడ్డి, రాజయ్య, శశికాంత్‌రెడ్డి, వెంకన్న, వనజలను ఘనంగా శాలువాలతో సన్మానించారు.

తల్లిదండ్రులకు క్రీడలు నిర్వహించడం హర్షణీయం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమని ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. వాసవ్య స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం కాకతీయనగర్‌లో ఏర్పాటు చేసిన పేరెంట్ మినీ ఒలింపిక్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడా జ్యోతిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో కేవలం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించే ఈ రోజుల్లో నిత్యం పని ఒత్తిళ్లు, మహిళలు ఇంటి పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ తల్లిదండ్రులకు క్రీడలు నిర్వహించడానికి వాసవ్య విద్యాలయం ముందుకు రావడం అభినందనీయమన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న జీఎం లలిత్‌కుమార్

క్రీడల్లో గెలుపొందిన తల్లిదండ్రులకు బహుమతులను అందజేశారు. పాఠశాల డైరెక్టర్ విక్రమ్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, అశీర హ్యాం డ్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు మిరాజ్ అహ్మద్, సునీత, రాయమల్లు పాల్గొన్నారు.

యాదవ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా రమేష్

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జాతీయ యాదవ పోరాట సమితి రాష్ట్ర యూత్ అధ్యక్షుడుగా పెద్దకల్వల గ్రామానికి చెందిన పెగడ రమేష్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాదులో జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ రమేష్‌కు నియామక పత్రం అందజేశారు. బీసీ సంక్షేమ సం ఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య, దూదిమెట్ల బాలరాజు యాదవ్, అనూష యాదవ్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు సన్మానం

సుల్తానాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఆదివారం సుల్తానాబాద్ లో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. పెద్దపల్లికి వెళుతున్న బండి సంజయ్‌ను బీజేపీ నేతలు పూసాల చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిపై స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువాతో పూల మాలలతో సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు చాతరాజు రమేష్ పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఆదివారం పెద్దపల్లి నుంచి చొప్పదండికి వెళుతుండగా మండల కేంద్రంలో కేంద్ర మంత్రికి మండల బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అమరగాని ప్రదీప్‌కుమార్, దొడ్ల రాజయ్య, గుమ్మడి శంకరయ్య, మెరుగు కనుకయ్య పలువురు ఉన్నారు.

యేసుక్రీస్తు త్యాగం గొప్పది



మాట్లాడుతున్న దుద్దిళ్ల శ్రీనుబాబు

మంథని, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు త్యాగం గొప్పదని శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. సీయోను చర్చిలో ఆదివారం జరిగిన ఈస్టర్ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. అలాంటి యేసుక్రీస్తును ఆరాధించడం ఎంతో భాగ్యమని, ప్రేమ, సహనం, శాంతికి నిర్వచనం క్రీస్తు బోధనలు అన్నారు. అవి ప్రపంచ శాంతికి దిక్సూచి అన్నారు. క్రైస్తవులకు స్వీట్లు తినిపించి పండగ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ మహేష్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్, సంఘ పెద్దలు జోసెఫ్, ప్రసాద్, రమేష్, ప్రేమ్‌కుమార్, సదానందం, కుమార్, కాంగ్రెస్ నేతలు పెండ్రు రమా-సురేష్‌రెడ్డి, ఐలి ప్రసాద్, పెంటరా రాజు, ఆకుల శ్రీనివాస్, దేవేందర్‌లు పాల్గొన్నారు.

పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

కమాన్‌పూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలలో నిర్మించిన ఆలయంలో పోచమ్మతల్లి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణకర్తలు మాజీ సర్పంచ్ సాగి శ్రీధర్‌రావు, సాయి శ్రీనివాసరావు, విగ్రహదాత తాళ్ల శేఖర్‌లను శ్రీనుబాబు సన్మానించారు. పోచమ్మతల్లి దీవెనలతో నియోజకవర్గ ప్రజలందరు క్షేమంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



ఐఎన్‌టీయూసీకి ప్రాధాన్యం ఇవ్వడం సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను ఉల్లంఘిస్తూ ఐఎన్‌టీయూసీకి ప్రాధాన్యతనివడం సరికాదని ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్ తెలిపారు. ఆదివారం కాలనీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ కార్మికుల మద్దతుగా గెలిచిందని, కానీ ఐఎన్‌టీయూసీ ప్రాతినిధ్య సంఘం హోదా దక్కని ఏరియాలో సైతం అధికా రులు వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. నైనీ బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తి ప్రారంభమైన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం యాజమాన్యం 11 ఏరియాల్లో అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించిందని రవీందర్ పేర్కొన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌కు ఏఐటీయూసీ గెలిచిన ఆర్జీ-1, 2 ఏరియాలతో పాటు బెల్లంపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల్లో ఐఎన్‌టీయూసీ నాయకులను ఆహ్వానించడం సరికాదన్నారు. సంస్థ ప్రతిష్ఠ పెరిగేలా ఇతర రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన సందర్భాన్ని పురస్కరించుకుని అన్ని జాతీయ సంఘాలను ఆహ్వానిస్తే తాము సంతోషించేవారమని, హోదాలేని యూనియన్‌ని ఆహ్వానించడం కోడ్ ఆఫ్ డిసిప్లేను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. యాజమాన్యం నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. రాజకీయ ప్రాబల్యం పెరిగిన సింగరేణిలో యాజమాన్యం తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలు సంస్థ నిర్వహణకు ఆటంకాలు కల్గుతాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని సింగరేణి అధికారులు నడుచుకోవాలని ఆయన సూచించారు. ఎల్ ప్రకాష్, అన్నారావు, శ్యాంసన్, బుర్ర తిరుపతి, గంధం సాంబశివరావు, రవికుమార్, సంపత్, మహేందర్, రాజ్‌కుమార్, వెంకటప్రసాద్, తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పుట్టిన రోజు

ధర్మారం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పుట్టినరోజు వేడుకలను బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండలం కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ముత్యాల బలరాంరెడ్డి, గుర్రం మోహన్‌రెడ్డి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రాచూరి శ్రీధర్, కూరపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొప్పుల ఈశ్వర్ కార్మిక నాయకుని రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారన్నారు. నాయకులు పూస్కూరి రామారావు, పాకల రాజయ్య, తుమ్మల రాంబాబు, ఆవుల శ్రీనివాస్, కాంపెల్లి చంద్రశేఖర్, మిట్ట తిరుపతి, నాడెం శ్రీనివాస్, గుర్రం తిరుపతి, దేవి వంశీ, ఇరగురాళ్ల మల్లేశం, ఆకారి సత్యం, దేవి రమణ, పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొప్పుల ఈశ్వర్ పుట్టిన రోజు పురస్కరించుకొని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు ఎండీ ఆజాం బాబా జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.